జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ
బుధవారం | 22 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 10



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**లింగాల గణపురం ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)** తేమ శాతం వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరకు కొనుగోలు చేయాల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మండలంలో కుందారం, నేల పోగుల, వనపర్తి గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ఆకస్మికంగా సందర్శించి... కేంద్రాలలో నిర్వాహకుల పని తీరు, మౌలిక వసతులు మొదలైన వాటిని పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు

మిగతా 2 లో...




# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం

- దశలవారీగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు
- మల్లూరు, మంగపేటలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి వినతుల వెల్లువ
- మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- మహిళా సంఘాలకు 60 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు
- గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు
- పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

**మంగపేట ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దశల వారీగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు.ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేటలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు.మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని, గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు.మంగళవారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి దర్శించుకున్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగపేట మండలం మల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో చుంచుపల్లి, కొత్త మల్లూరు,

మిగతా 2 లో...

## "సంగెం సమీక్ష".. అధికారుల తీరు పై ఎమ్మెల్యే రేవూరి సీరియస్..!




- నీటి కష్టాల పై సమీక్షకు అధికారుల గైర్హాజరు..
- ప్రజల కష్టాల కంటే అధికారులకు పనులు ఎక్కువయ్యాయా..?
- దాహార్తి తీర్చమంటే డుమ్మా కొడతారా..?అధికారుల తీరు పై మండిపడ్డ పరకాల ఎమ్మెల్యే

రేవూరి ప్రకాష్ రెడ్డి

**సంగెం, ఏప్రిల్21 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజున నిర్వహించిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారం,వేసవిలో నీటి ఎద్దడి పై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.అయితే కీలక శాఖలకు చెందిన పలువురు అధికారులు సమావేశానికి గైర్హాజరు

మిగతా 2 లో...

## యువత నైపుణ్యాభివృద్ధికి ఏటీసీ కీలకం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, ఏప్రిల్ 21, (ప్రజాజ్యోతి):** పరకాల ప్రాంత యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించేందుకు అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) కీలకంగా మారుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలో ప్రతిపాదిత ఏటీసీ ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువత ఉద్యోగావకాశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని పేర్కొన్నారు. ఏటీసీ నిర్మాణంతో పరకాల పట్టణ అభివృద్ధికి ఊతమిస్తుందని అన్నారు. పరకాలను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాజుపేట సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏటీసీ సెంటర్ ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. పట్టణానికి పూర్వ వైభవాన్ని

మిగతా 2 లో...

## మొక్కజొన్న కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి




**నర్సంపేట ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మొక్కజొన్న కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

మిగతా 2 లో...

# "సంగెం సమీక్ష"..అధికారుల తీరు పై ఎమ్మెల్యే రేవూరి సీరియస్..!





(మొదటి పేజీ తరువాయి...)

కావడం పై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు:**

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు,కీలకమైన ప్రగతి ప్రణాళిక సమావేశానికి దుమ్మా కొట్టడం పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు."ప్రభుత్వ లక్ష్యాలకు అడ్డుపడినా,ప్రజా సమస్యల పట్ల అలసత్వం ప్రదర్శించినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు" అని ఆయన హెచ్చరించారు.

**నీటి కొరత పై యుద్ధ ప్రాతిపదికన చర్యలు:**

ఎండలు మండుతున్న నేపథ్యంలో మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలని,పైపులైన్ల లీకేజీలను తక్షణమే అరికట్టాలని,అవసరమైన చోట ప్రత్యామ్నాయ వనరులను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు

**అర్హులందరికీ పథకాలు:**

ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ రవీందర్,తహసీల్దార్ రాజుకుమార్,డిపిఓ,ఎంపీఓ,వివిధ శాఖల అధికారులు,పంచాయితీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజీ తరువాయి...)

ధర చెల్లిస్తుం దని, ఈ క్రమంలో రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పక్కాగా టోకెన్ విధానాన్ని అనుసరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలన్నారు ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, మౌలిక వసతులు కల్పించడంతో పాటు గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొను గోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

# యువత నైపుణ్యాభివృద్ధికి ఏటీసీ కీలకం

(మొదటి పేజీ తరువాయి...)



తీసుకురావడానికి ప్రజల సహకారం అవసరమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్ ఎస్సీ, బీసీ వెల్ఫేర్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ దివ్య విద్యాసాగర్, వార్డు కౌన్సిలర్లు, ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఏటీసీ జిల్లా కన్వీనర్ ఎం.చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం





(మొదటి పేజీ తరువాయి...)

మల్లూరు, నర్సింహసాగర్, శనగకుంట, పూరేడుపల్లి గ్రామాల ప్రజల నుండి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.అనంతరం మంగపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంగపేట, కమలాపూర్, బోరు నర్సా పూర్, కోమటిపల్లి, కొత్తూరు, మోట్లగూడెం, తొండ్యాల లక్ష్మీపురం గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక గ్రామాల్లోని సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులు, ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగ వివరాలను మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర సంబంధిత పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.గ్రామ సభలను సక్రమంగా నిర్వహించి,గ్రామ ప్రజలకు అవసరమైన,అందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులకు మాత్రమే నిధులను వినియోగించాలని,గ్రామసభ అనుమతి లేకుండా నిధులను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. మల్లూరు ప్రజా దర్బార్‌లో 130, మంగపేటలో 210 దరఖాస్తులు అందాయి.ఈ సందర్భంగా రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా వినూత్నంగా స్థానిక గ్రామాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే సంకల్పంతో ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తో పాటు అధికారులు గ్రామ ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు, ఉచిత విద్యుత్, పోడు భూముల పట్టాలు, పలు రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, పెన్షన్లు,ఇందిరమ్మ గృహాలు,ఇతర సంక్షేమ పథకాలకు వచ్చిన దరఖాస్తులపై ఫీల్డ్ విజిట్ చేసి అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండవ విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, జూన్ 2వ తేదీ నుండి నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని, రెవెన్యూ – అటవీ అధికారుల సమన్వయంతో పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని,ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాగునీటి సరఫరా సాధ్యం కాని గుత్తికోయ ఆవాసాల్లో ప్రత్యేక వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని, మహిళా సంఘాల సభ్యులకు 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం చేకూరుతోందని, మహాలక్ష్మి పథకం ద్వారా కోట్లాది మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేస్తున్నామని వివరించారు.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్ష మందికి పెన్షన్లు మంజూరు చేశామని, జూన్ 2వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి,కార్యదర్శుల ద్వారా పరిశీలించి అర్హులకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ నిధులను తాగు నీరు,విద్యుత్ బిల్లుల చెల్లింపు,డ్రైనేజీ పనులు, మోటార్ల రిపేర్లు వంటి గ్రామ అవసరాలకు వినియోగించాలని సూచించారు.

ప్రతి రూపాయిని గ్రామ సభల ద్వారా పరిశీలించి, ఖర్చు చేసిన పనులకే బిల్లులు తీయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. మంగపేట మండలం కమలాపూర్ గ్రామంలో బస్టాండ్ కావాలని గ్రామస్తులు కోరగా వెంటనే స్పందించిన మంత్రి సీతక్క బస్టాండ్ నిర్మాణానికి అను వైన స్థలం ఉంటే వెంటనే వాటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ గోదావరి పుష్కరాల వరకు ప్రజలకు అందుబాటు లోకి తీసుకువచ్చేవిధంగా చూడాలని పేర్కొన్నారు. సుమారు 70 కోట్ల నిధుల అంచనాతో మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, బాసర నుండి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉండే పుణ్య క్షేత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేయాలని సంకల్పించుకున్నారని పేర్కొన్నారు.

త్వరలోనే మంగపేట కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, బస్టాండ్, మార్కెట్ యార్డ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్, భూ సమస్యలు తదితర అంశాలపై దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు.ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని, గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యల కోసం కలెక్టరేట్ లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని,ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫోన్ నంబర్ల ద్వారా దరఖాస్తు స్థితిని తెలియ జేస్తామని స్పష్టం చేశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో మంగపేట మండలం దోమెడ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని 15 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర కుట్టుమిషన్ల దాత చంద్ర మౌళిలతో కలిసి పంపిణీ చేశారు.

ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముందుగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కళ సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ఆరు గ్యారెంటీల పథకాలపై కళా ప్రదర్శన చేశారు.మూఢ నమ్మకాలు,మత్తు పదార్థాల అలవాట్ల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సిహెచ్.మహేందర్ జీ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, డైరెక్టర్లు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా అడుప రాజు నియామకం.



**వర్ధన్నపేట ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామ వాసి అడుప రాజును భారతీయ జనతా పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి అధికారికంగా ప్రకటన చేసి, అడుప రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడుప రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి మరియు జిల్లా అధ్యక్షుడు గంట రవికి కృతజ్ఞతలు తెలిపారు. వర్ధన్నపేట మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. కార్యకర్తలతో సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాయపురం కుమారస్వామి, మండల నాయకులు మైస రాము, ఇల్లంద శక్తి కేంద్రం ఇంచార్జ్ సట్ల అనిల్ గౌడ్, మూల రాము, సుల్తాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

దాదాపు 72 వేల ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. 2 లక్షల 25 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారని అన్నారు. అందుబాటులో ఉన్న గోదాములలో వెంటనే కొనుగోలు చేసిన పంటను తరలించాలని అన్నారు. అందుబాటులో ఉన్న గోదాములను అన్వేషించి వెంటనే సరుకు దిగుమతి అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైతే తాత్కాలిక గోదాములను సిద్ధం చేయాలని, మరింత మంది హమాలీలను తీసుకోవాలని సూచించారు. అకాల వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ అధికారి నీరజ , మార్క్ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్, ఆర్డీఓ ఉమారాణి, నర్సంపేట మార్కెట్ చైర్మెన్ పాలాయి శ్రీనివాస్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహా ఏకశిలా హనుమాన్ విగ్రహం ఆకర్షణ

- భక్తులకు ఆశ్రయంగా అంజన్న స్వామి సన్నిధి
- ప్రత్యేక సేవా కార్యక్రమాలు ప్రారంభం

**పరకాల, ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి):** పరకాల పట్టణంలో వెలసిన హనుమాన్ ఏకశిలా విగ్రహం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. అరుదైన శిల్పకళతో నిర్మించబడిన ఈ మహా విగ్రహం భక్తులను ఆకర్షిస్తూ ఆధ్యాత్మిక కేంద్రముగా నిలుస్తోంది. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా భావిస్తూ భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు.హుజురాబాద్ మార్గంలో రామాలయం సమీపంలో ఎడమ వైపున ఏర్పాటు చేసిన ఈ విగ్రహం, పరకాల ప్రముఖులు మరియు హనుమాన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించబడింది. స్వామి వారి రూపం భక్తులకు ప్రత్యక్ష దర్శనానుభూతిని కలిగిస్తూ విశేష ఆకర్షణగా నిలుస్తోంది.పరకాల మండలం మల్లక్కపేట అంజన్న స్వామి, కొండగట్టు హనుమాన్ ఆలయాల సరసన ఈ విగ్రహం కూడా విశేష ప్రాధాన్యతను సంపాదించుకుంది. వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల భక్తులు జీవితంలో ఒక్కసారైనా ఈ స్వామిని దర్శిస్తే ధన్యమవుతుందని విశ్వసిస్తున్నారు.భక్తుల కోరికలు నెరవేర్చే దైవంగా భావించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21, 25, 28 మరియు మే 2, 5, 9 తేదీలలో సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో అల్పాహార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సేవా కార్యక్రమాల ద్వారా భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ స్వామివారి కృపను అందిస్తున్నారు. హనుమాన్ వాకర్స్ సభ్యుల సేవా కార్యక్రమాలను భక్తులు అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.






# ఉపాధి హామీ పనులు లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి

- పరకాల మండలం నాగారంలో పనుల పరిశీలన
- కూలీల సౌకర్యాలపై కలెక్టర్ దృష్టి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**పరకాల, ఏప్రిల్ 21, (ప్రజాజ్యోతి):** ఉపాధి హామీ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మంగళవారం పరకాల మండలం నాగారం గ్రామంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా ఆమె క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కూలీల హాజరు వివరాలకు సంబంధించిన మస్టర్ రోల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూలీలు పని ప్రదేశానికి వచ్చే సమయం, పని గంటలపై కూడా విచారణ చేశారు. కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ సూచించారు. వేసవికాలం దృష్ట్యా ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు, కూలీలకు సూచనలు ఇచ్చారు.కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీనాగారం గ్రామంలో ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు కలెక్టర్, డీఆర్డీవో స్వయంగా ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏరుకొండ రమాదేవి, డీఆర్డీవో శ్రీను, పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, మండల పంచాయతీ అధికారి విమల, ఏపీవో ఇందిర, ఉప సర్పంచ్ రజనీకర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమల తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



**హనుమకొండ ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీ విజయ్ కుమార్, శ్రీ నర్సింహా రావు తదితరులు ఉన్నారు.వీరి వెంట హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ రవీందర్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు సంప్రదాయ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులతో కలిసి అమ్మవారి సేవలో పాల్గొన్న అధికారులు ప్రత్యేక దర్శనం పొందారు.

# ధర్మసాగర్ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుల రాజీనామా

**ధర్మసాగర్, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీకి సంబంధించిన లబ్ధిదారుల ఎంపికలో గాని, నిర్ణయాల విషయంలో గాని ఎలాంటి సమాచారం లేకుండా తమను పక్కన పెట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమూహంగా రాజీనామా చేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, కమిటీ సభ్యులుగా తమను ఎంపిక చేసినప్పటికీ, సమావేశాలకు పిలవకుండా, నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసలు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేకపోవడం వల్ల నిజమైన అర్హులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో కమిటీలో కొనసాగడం సరైంది కాదని భావించి, తమ రాజీనామా పత్రాలను అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిపించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎర్రబెల్లి శరత్, రావుల వెంకటరెడ్డి, బొడ్డ లెనిన్, బొడ్డ అరుణ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి పిల్లలకు సర్టిఫికెట్ల పంపిణీ



**శాయంపేట ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి:** మండలంలోని కొప్పుల గ్రామంలో ఉన్న అంగన్వా డీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మామిడి అశోక్ పాల్గొని అంగన్వాడి సెంటర్లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లను, యూనిఫామ్స్ ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని, గర్భిణీల నుంచి పుట్టిన పిల్లల వరకు సరైన పోషణ అందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలువాల భాస్కర్, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, ఆశలు, పాల్గొన్నారు.

# గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**దామెర /తక్కళ్లపహాడ్, ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి):** వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు, ప్రయాణికులు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపహాడ్ గ్రామంలో గ్రామ సర్పంచ్ దాడి వసంత రమేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ చలివేంద్రం ప్రారంభించారు. గ్రామస్తులకు తాగునీరు అందించే విధంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ప్రయాణికులు, రైతులు, గ్రామస్తుల దాహం తీర్చుకునేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ ఉపసర్పంచ్ బండారి ప్రభాకర్ వార్డు సభ్యులు కొత్తపల్లి మల్లేష్, గ్రామస్తులు దాడి బిక్షపతి, దాడి సంపత్, దాడి శరబంధం, దాడి సుధాకర్ మార్త కోటి, మహిళలు పాల్గొన్నారు.

# గుంటూరుపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ దీక్షల స్వీకరణ



**సంగెం,ఏప్రిల్ 2(ప్రజాజ్యోతి):** మండలంలోని గుంటూరుపల్లి గ్రామ శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రోజున హనుమాన్ దీక్షల స్వీకరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ అర్ధ మండల దీక్షలు చేపట్టారు.ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కోడగండ్ల శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఉపసర్పంచ్ దండా నరేష్ తో పాటు గ్రామానికి చెందిన నాలజాల స్వామి,లౌకిక్,దామచర్ల రామరావు,ఆళ్ల ప్రకాష్, సాంబ శివ,యారాం సుబ్బారావ్,వీరేశ్,మగసాని యాకయ్య, రాఘవేంద్ర, పోక శ్రీనివాస్ రావు తదితరులు మాల ధారణ చేసి దీక్షలు తీసుకున్నారు.

**లోక కల్యాణం కోసం ప్రార్థన:** ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాస చార్యులు మాట్లాడుతూ..వానలు సమృద్ధిగా కురిసి,పాడి పంటలు బాగుండాలని, రైతులందరికీ మేలు జరగాలని కోరుతూ ఈ దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు.గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## అంబేద్కర్ సెంటర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం



**పరకాల, ఏప్రిల్ 21, (ప్రజాజ్యోతి):** పరకాల పట్టణంలోని 16వ వార్డు అంబేద్కర్ సెంటర్‌లో గత ఐదు రోజులుగా నిలిచిపోయిన మంచినీటి సరఫరా కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను తెలుసుకున్న 16వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీధర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు.ఈ సందర్భంగా స్థానికులు ఆయన తక్షణ చర్యలను అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నట్లు బండి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఐలపెల్లి స్వామి, బండి రాజు, గోవింద ఉపేందర్ తదితర నాయకులు, వాడ ప్రజలు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకి వినతి పత్రం అందజేత

- ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్



**ఎల్కతుర్తి ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీడీవో విజయ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రోజురోజుకు బలహీన పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకురావాలని యోచిస్తున్న విబజీ రామ్ బిల్లును వెంటనే రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదని పని ప్రదేశాల్లో మంచినీరు నీడ మెడికల్ కిట్ల వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఏటా బడ్జెట్లో కోతలు విదేస్తోందని ఆరోపించారు. వి బి జి రామ్ పేరుతో కేంద్రం తీసుకురాబోయే కొత్త చట్టం వల్ల ఉపాధి హామీ కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 2005లో ఎంతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. పని ప్రదేశాల్లో రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని ఒక్కసారి ఫోటో తీస్తే చాలని సూచించారు. ఫోటో రాకపోతే ఆరోజు వేతనంలో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి ₹200 రోజుల పని కల్పించి కొలతలు లేకుండా రోజువారి వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కమిటీ మెంబర్ అంబాల స్వరూప కమిటీ సభ్యులు లోకిని స్వరూప, సుబ్రహ్మణ్యం, రాధా, కరుణ, షణ్ముఖం, యాదగిరి, సర్కార్, అజ్మీర, బిక్షపతి, మెట్టు సమ్మయ్య, రజిత, కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీ భద్రకాళీ దేవస్థానంలో కళ్యాణ బ్రహ్మోత్సవాలు





**హనుమకొండ ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)**

శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు మూడవ రోజుకు వైభవంగా కొనసాగాయి.తెల్లవారుజామున గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన చేశారు. అనంతరం ఉదయం అమ్మవారిని మకర వాహనంపై, సాయంకాలం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు.భవసాగరంలో కొట్టుమిట్టాడుతున్న జీవులను కోరికలు పీడిస్తుంటాయని, మకర వాహనంపై సేవింపబడే అమ్మవారిని దర్శించడం వల్ల సంసార సాగరాన్ని దాటే శక్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అలాగే చల్లదనానికి ప్రతీక అయిన చంద్రుని ప్రభావాన్ని సూచించే చంద్రప్రభ వాహన సేవ ద్వారా మనస్సుకు ప్రశాంతత, స్వాంతన లభిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. స్వచ్ఛమైన చిత్తంతో ఉన్న భక్తులకు ఆధ్యాత్మిక సాధనలో అభివృద్ధి కలిగి, ఇహపర సౌఖ్యాలు సిద్ధిస్తాయని వివరించారు.ఈ సందర్భంగా ఆది శంకరాచార్యులు జయంతిని ఉదయం ఉషకాలార్చన అనంతరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ శ్రీమతి రామల సునీత, ధర్మకర్తలు మయూరి రామేశ్వరరావు, ఓరుగంటి పూర్ణచందర్, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ రోజు ఉత్సవాలకు ఉభయదాతలుగా హనుమకొండ జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం వ్యవహరించింది. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, నాగుర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.పూజల అనంతరం అతిథులకు అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించారు.అభిషేకం అనంతరం మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంకాలం చంద్రప్రభ వాహన సేవను వరంగల్ జిల్లా వడ్డెర కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సాయంకాలం గం॥ 07-00లకు ఎదుర్కోలు ఉత్సవం (కళ్యాణ రాయబారం) ప్రారంభమైంది.ఈ సందర్భంగా ప్రముఖ సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ గోరుగంతు భాస్కర వెంకట సుబ్రహ్మణ్య శర్మ, రాయప్రోలు వెంకట సత్యకామేశ్వర శర్మలు నిర్వహించిన శివకళ్యాణ రాయబారం ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు కైలాసంలో శివపార్వతుల కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తున్న అనుభూతిని పొందారు. అనంతరం



ప్రసాద వితరణ జరిగింది.బుధవారం అనగా 22-04-2026 బుధవారం సాయంకాలం జరగనున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణంలో పాల్గొనదలచిన భక్తులు రూ॥ 516/-లు చెల్లించి రశీదు పొందవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేయబడతాయి.రామల సునీత కార్యనిర్వహణాధికారిసహాయ కమిషనర్ తెలిపారు.

## ఇగ్నిటింగ్ మైండ్స్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకతకు నూతన దిశ




**వరంగల్ సిటీ, ఏప్రిల్ 21(ప్రజాజ్యోతి):** నగరంలోని బొల్లికుంట లో గల విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ సృజనాత్మకత మరియు ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "ఇగ్నిటింగ్ మైండ్స్ – క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్" అంశంపై ఒక రోజు విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని విభ సీఈఓ చి. విశ్వాంబర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిశ్రమల కేంద్రం, వరంగల్‌కు చెందిన జనరల్ మేనేజర్ ఎ. నరసింహ మూర్తి పాల్గొని విద్యార్థులకు ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. శశిధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమ కన్వీనర్ డా. పి. శివ శంకర్ కార్యక్రమ లక్ష్యాలను వివరించి, విద్యార్థులు కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డా. ప్రసాద రావు ఎంట్రప్రెన్యూర్షిప్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డా. వై. భాస్కర్ రావు, ఐఐసీ ఇన్‌చార్జ్ శ్వేత, విభ కో–ఆర్డినేటర్ ప్రియాంక, అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాల్గొన్న అధ్యాపకుల్లో జి. ముక్తీశ్వర్, డా. ఎం. సరిత, డా. ఎల్. జయరామ కృష్ణ, ఎన్. ప్రదీప్, వై. శ్రావణ్, డా. వి. రామచంద్ర మూర్తి, ఎన్. అనిత, పి. వాగ్దేవి, పి. సంధ్య, డా. బి. సునీల్, ఆర్. శశాంక్ ఉన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, వ్యాపార అవగాహన, పారిశ్రామిక దృక్పథం పెంపొందించడంలో విశేష ఫలితాలు సాధించిందని నిర్వాహకులు తెలిపారు.

## వరంగల్ తూర్పు గురుకుల డిగ్రీ కళాశాలలో పరిశుభ్రత డ్రైవ్

- తనిఖీ చేసిన జిల్లా వయోజన విద్యాధికారి రమేష్ రెడ్డి

**వరంగల్ సిటీ, ఏప్రిల్ 21(ప్రజాజ్యోతి):** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నగరంలోని రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్ వద్ద గల వరంగల్ తూర్పు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళల)లో కిచెన్ మరియు శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా వయోజన విద్యాధికారి రమేష్‌రెడ్డి కళాశాలను సందర్శించి కిచెన్ మరియు శానిటేషన్ ఏర్పాట్లపై సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రైవ్‌లో భాగంగా కిచెన్ పరిసరాలు, భోజన తయారీ విధానాలు, పాత్రల శుభ్రత, తాగునీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వీపర్లు, స్కావెంజర్ల సహకారంతో కళాశాల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచి, విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. భోజనశాల, కిచెన్ ప్రాంతాలను శుభ్రపరిచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించారు. కిచెన్ సదుపాయాలు, ఆహార తయారీ విధానాలు, శానిటేషన్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే సదుపాయాలు, వ్యర్థాల వర్గీకరణ మరియు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. తదనంతరం విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెరిగి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం ఏర్పడిందని కళాశాల నిర్వాహకులు తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ పూజ

- తండాలో పరకాల ఎమ్మెల్యే రేవూరి సందడి..!
- బాలునాయక్ తండా సర్పంచ్ నర్సింహా ఇంట్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**సంగెం,ఏప్రిల్21(ప్రజాజ్యోతి):** మండలంలోని బాలునాయక్ తండాలో మంగళవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.గ్రామ సర్పంచ్ బాధవత్ నర్సింహానాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ జగదాంబ పూజ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..భక్తి మార్గం ద్వారా మానసిక



ప్రశాంతత లభిస్తుందని,ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కోరారు.తండా ప్రజలు,గ్రామస్తులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహా నాయక్ కుటుంబ సభ్యులతో పాటు,ఆయా గ్రామాల సర్పంచులు మండల స్థాయి ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తుల రాకతో బాలునాయక్ తండాలో కోలాహల వాతావరణం నెలకొంది.

# ప్రజలు ఆధ్యాత్మిక చింతనను పెంచుకోవాలి

- దుర్గమ్మ పండుగ ఉత్సవాలలో పాల్గొన్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్
- చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి ఏప్రిల్ 21 ప్రజాజ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామం చక్రు తండా లో మంగళవారందుర్గమ్మ పండుగ ఉత్సవాలలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తండా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, దేవరుప్పుల మండల పార్టీ నాయకులు ఏలే సుందర్,మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి,, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్ మండల పార్టీ నాయకులు పసునూరి శ్రీనివాస్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, బిక్షపతి, గుగులోత్ చందు నాయక్, వినోద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మాతా, శిశు ఆరోగ్యానికి స్పెషల్ ఇమ్యునైజేషన్ డ్రైవ్ కీలకం

- డీఎంహెచ్ఓ డా. సాంబశివరావు



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 21(ప్రజాజ్యోతి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం మీటింగ్ హాల్లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అధ్యక్షతన సూపర్వైజర్లు, సంబంధిత సిబ్బందికి స్పెషల్ ఇమ్యునైజేషన్ డ్రైవ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సాంబశివరావు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సమయానికి అందించడం ద్వారా మాతా, శిశు ఆరోగ్యాన్ని సమర్థంగా రక్షించవచ్చని తెలిపారు. రొటీన్ ఇమ్యునైజేషన్‌లో టీకాలు మిస్సైన పిల్లలను గుర్తించి వారికి తప్పనిసరిగా టీకాలు ఇవ్వాలని, అందుకోసం ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి అర్హత కలిగిన పిల్లలు, గర్భిణీ స్త్రీలకు టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఇమ్యునైజేషన్ క్యాంపెయిన్ మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశ ఏప్రిల్ 27 నుండి మే 4 వరకు, రెండవ దశ జూలై 20 నుండి 27 వరకు, మూడవ దశ అక్టోబర్ 12 నుండి 19 వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వ మరియు నిర్వహణకు ఉపయోగించే ఈవిన్ మొబైల్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. అలాగే కోవిడ్ టీకాల కోసం ఉపయోగించిన కోవిన్ పోర్టల్ తరహాలో గర్భిణీలు, చిన్నపిల్లల టీకాల వివరాల నమోదు కోసం రూపొందించిన యు–విన్ పోర్టల్ వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. టీకాలు పొందిన ప్రతి చిన్నారి వివరాలను యు–విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముందస్తు ప్రణాళికతో నిర్దేశిత తేదీల్లో వ్యాక్సినేషన్ నిర్వహించాలని కోరారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇఫ్తేకర్ అహ్మద్ సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, గుర్తించిన రోగులకు నిరంతర చికిత్స అందించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నమోదు పెంచడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించవచ్చని, అవసరం లేని సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ డీపీఎచ్ఎన్ఓ మనోజ్, సూపర్వైజర్లు మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ బాధ్యత

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**వర్ధన్నపేట, ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, దమ్మన్నపేట గ్రామంలో ఐకెపి మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఐఏఎస్ తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మితే సరైన ధరతో పాటు తక్షణ చెల్లింపులు అందుతాయని పేర్కొన్నారు.రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ఐకెపి మహిళలు కొనుగోలు కేంద్రాల నిర్వహణలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమని కొనియాడారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకెపి మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిర్ర దర్గయ్య మృతి పార్టీకి తీరని లోటు

- పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్



**రాయపర్తి ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి** రాయపర్తి మండలం మైలారం గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిర్ర దర్గయ్య అనారోగ్యంతో మరణించగా, వారి పార్థివా దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి వార్డ్ నెంబర్ లు పరుపాటి రవీందర్ రెడ్డి, గాడిపెల్లి రాములు, పార్టీ ముఖ్య నాయకులు గుడెల్లి వెంకటయ్య,సంధి దేవేందర్ రెడ్డి గబ్బేట కొమురయ్య, సంకినేని ఎల్లస్వామి చిర్ర రవి యాకయ్య బచ్చలి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వెంకటాపురం,ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలసాని వేణు గృహం వద్ద కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన పాయం రమణ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.2,11,500 విలువగల చెక్కులను ఆరుగురు లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా పాయం రమణ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పేదలకు,కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తుందని అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వాళ్లకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలసాని వేణు,ములుగు జిల్లా కార్యనిర్వహక సభ్యులు మద్దుకూరి ప్రసాద్,మంచర్ల బిక్షపతి,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు టి.ఆర్.పి. సంపూర్ణ మద్దతు

- టి. ఆర్ .పి. జిల్లా అధ్యక్షుడు రవి పటేల్.

**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి, ఏప్రిల్ 21.** తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మంగళవారం రోజున జిల్లా కేంద్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.బుధవారం నుండి తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా, టిఆర్పి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా టిఆర్పి పార్టీ సమ్మెలో పాల్గొంటుందని తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా టిఆర్పి పార్టీ ఆర్టీసీ సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తుందని రవి పటేల్ స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంతవరకు భూపాలపల్లిలో ఒక్క బస్సు కూడా డిపో నుండి బయటకు వెళ్లనివ్వమని హెచ్చరించారు. కార్మికులు తమ కష్టంతో ఆర్టీసీని నిలబెట్టుకుంటున్నారని, వారి న్యాయమైన 32 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో, టిఆర్పి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, మోటపోతుల సమ్మయ్య, కౌటం సురేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఏర్పాటు





**వాజేడు, ఏప్రిల్ 21, (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వాజేడు మండలంలోని చెరుకూరు గ్రామంలో నాయి బ్రాహ్మణ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాయి బ్రాహ్మణ సేవా సంఘం ములుగు జిల్లా గౌరవ అధ్యక్షుడు జంపాల రవీందర్ అధ్యక్షతన కొత్త మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సిరిమర్తి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా ముక్కెర రాజశేఖర్ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయి బ్రాహ్మణ సంఘం కార్యక్రమాలు, సమాజ సేవలు, సభ్యుల అభ్యున్నతి పెంపొందించే విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలని, నాయి బ్రాహ్మణ వృత్తిలోకి కార్పొరేట్ ఆగమనాన్ని అడ్డుకోవాలని, ఆలయాలు, జాతరలలో ఉద్యోగాలు, తలనీలాల ఆదాయంలో వాటాల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని నాయి బ్రాహ్మణ కులస్తులకు పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంఘం మండల అధ్యక్షుడు సిరిమర్తి మల్లికార్జున్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సంఘం లక్ష్యా సాధనకు అందరూ కలిసి పనిచేయాలని, సమాజంలో మన సేవలు గుర్తించబడేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యవర్గంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా బద్దెల సత్యనారాయణ, కోశాధికారిగా బద్దెల శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా శ్రీరాముల అరుణ్ లను ఎన్నుకున్నారు. నాయి బ్రాహ్మణ కులస్తులు కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయి బ్రాహ్మణ కులస్తులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

- ఆహార నాణ్యత, పరిశుభ్రత లను పరిశీలించారు
- పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు



**రాయపర్తి ఏప్రిల్ 21 ప్రజాజ్యోతి**సంక్షేమ వారోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా రెండవ రోజు జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రతిభ ఉత్సవాలు, వ్యాసరచన పోటీలు, వీధి నాటకాలు వంటి అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టళ్లు మరియు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా రాయపర్తి మండలంలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కళాశాలను , పర్వతగిరి కేజీబీవీ ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలను, అందిస్తున్న విద్యా సదుపాయాలను, వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు.విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాస స్థాయి, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గురుకులాల్లో విద్యార్థుల స మగ్ర అభివృద్ధికి క్రీడలు మరియు ఇతర సహ పాఠ్య కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడిఓ పుష్పలత, సంబంధిత హాస్టల్ మరియు రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని, విద్యార్థుల్లో చదువు, క్రీడలు, పాటలు మరియు వివిధ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు.

# పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నాగరాజు.



**వర్ధన్నపేట ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ ఫలితాలను ప్రజల గడపకు చేర్చుతూ మరో మైలురాయిని చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు మెరుగు రమ–రాజాలు కుటుంబం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన కొత్త ఇంటిని ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ గృహ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఐఏఎస్‌తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. గ్రామస్తులు, స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తల సమక్షంలో కార్యక్రమం ఆనందోత్సాహ వాతావరణంలో జరిగింది.అనంతరం ఎమ్మెల్యే నాగరాజు లబ్ధిదారు కుటుంబానికి బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేద కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరడం ఆనందకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద మరియు మధ్య తరగతి కుటుంబాలకు సొంత గృహం కల్పించడం ప్రధాన లక్ష్యం” అని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాల లబ్ధి చేకూర్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. గ్రామస్తులు ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## సీ.ఎం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్.



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి ,ఏప్రిల్ 21.** ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యం విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ నిన్న కాటారం మండలంలోని నాస్తూరీపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి దుద్ధిల్ల శ్రీధర్ బాబు గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్సవాల సందర్భంగా రైతు భరోసా నిధులు విడుదల చేయడానికి విచ్చేసిన గౌ శ్రీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ రైతన్నల పక్షణ కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుంది. ఈ యొక్క ప్రజా పాలన రైతు ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేసినటువంటి భూపాలపల్లి జిల్లాలో ఉన్నటువంటి రైతన్నలకు మరియు కార్మికులకు కర్షకులకు విద్యార్థులకు యువకులకు ఇంత జన సందోహాన్ని హాజరవడానికి కృషి చేసినటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ రేపు రాబోయే రోజుల్లో కూడా మరి రేవంత్ రెడ్డి గారు అని రెండున్నర సంవత్సరాల కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు, 100 యూనిట్ల కరెంటు,మూడు లేని వాళ్లకు గూడు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు, ప్రతి పేదవాడు మూడు పూటలా అన్నం తినాలని ఉద్దేశంతో దొడ్డు బియ్యం తీసేసి ఈరోజు సన్న బియ్యం పథకాన్ని, తీసుకొచ్చినటువంటి నాయకుడు రేవంత్ రెడ్డి గారు ఈరోజు గత ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ఇవ్వడం జరిగిందో ఆప్రతి హామీని గౌరవ రేవంత్ రెడ్డి గారు అమలు చేయడానికి కృత నిశ్చయంతో ముందుకు వెళ్తున్నారని సందర్భంగా తెలియజేస్తూ రేపు రాబోయే రోజులలో కూడా కాంగ్రెస్ పార్టీ 20 సంవత్సరాలు అధికారంలో ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ మరొకసారి ఇంతటి భారీ బహిరంగ సభను విజయవంతం చేసినటువంటి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ భువనసుందరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల లక్ష్మీ జిల్లా కార్యదర్శులు పరమేశ్వరి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ అప్పల శీను పార్టీ జిల్లా ఎన్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు మాట్టేవాడ సురేష్, వినోద్, విజయ భాస్కర్,నాగరాజు,సురేష్, కార్తీక్, రాజు, తదితరులు పాల్గొన్నారు

## సీఎం సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు

- కాంగ్రెస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొండగొర్ల బాపు



**మహాముత్తారం ఏప్రిల్ 21.ప్రజాజ్యోతి** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు నస్తూరుపల్లిలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన మహాముత్తారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, సర్పంచులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొండగొర్ల బాపు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా రైతులకు 2వ విడత రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతు ప్రభుత్వం అని నిరూపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కష్టపడిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని ఆయన తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటాం

- చెన్నారావుపేట మండల ప్రెస్ కమిటీ







**చెన్నారావుపేట్ ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)**చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన పాత్రికేయులు వరంగల్ జిల్లా ట్రైబల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాకూబ్ తండ్రి హర్జా నాయక్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసు కొని మండల పాత్రికేయులు చెన్నారావుపేట ప్రెస్ మండల కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ సుబాన్ గౌరవాధ్యక్షులు కూస సుదర్శన్ ఆధ్వర్యంలో జాటోత్ యాకుబ్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ సంక్షేమ కుటుంబానికి మండలంలో ఏ ఆపద వచ్చినా అండగా మేమున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పాత్రికేయులు మల్లాడి వీరారెడ్డి చేలుకలపెల్లి రాజు తొగరు బుచ్చిరెడ్డి బేతి రజాకర్ మధ్యబోయిన రమేష్‌రాజేందర్ తదితరులు ఉన్నారు.

## అనుమానస్పదంగా యువకుడు మృతి

- మృతుడు నర్సంపేట పట్టణంలోని కుమ్మరి కుంట కు చెందిన సిద్దార్థ
- పాఖాల వద్ద స్నేహితులతో కలిసి బర్త్ డే వేడుకలు
- తన కొడుకు మరణం పై పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి



**ఖానాపురం /ఏప్రిల్ :21(ప్రజా జ్యోతి )** స్నేహితులతో కలిసి బర్త్ డే వేడుకలు చేసుకుంటున్నాం అని తెలిపిన యువకుడు అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన ఖానాపురం మండలం పాఖాల వాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు.. నర్సంపేట పట్టణంలోని కుమ్మరి కుంట కు చెందిన వల్లపు దాస్ అనిత కుమారుడు సిద్ధార్థ (19) నర్సంపేట లోని ఫంకీ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి బర్త్ డే వేడుక కోసం పాఖాల కు వచ్చానని, షాపులో పనిచేయడానికి ఆలస్యంగా వస్తానని సోమవారం తన స్నేహితుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. ఈ క్రమంలో మంగళవారం పాఖాల వాగు నుంచి గిరక తాళ్ల కు వెళ్లే దారిలో బుడుగు మత్తడి వద్ద అనుమానస్పదంగా మృతి చెంది ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ ప్రభుత్వ పథకాలు.దేశానికి ఆదర్శం

- -స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**రఘునాథపల్లి, ఏప్రిల్ 21(ప్రజాజోతి )** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి కడియం శ్రీహరి తెలిపా రు.మండలంలోని వెల్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిర మ్మ ఇల్లు,ఎంజిఎన్ఆర్జిఎస్, ఎస్డిఎఫ్ నిధుల కింద 20లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను అదేవిదంగా ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.తెలంగాణ ప్రభుత్వం మొట్టమెదటి సారిగా రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న 1కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా భీమా పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లు వెల్లడించారు.ఈ పథకంకింద కుటుంబ పెద్ద చనిపోతే 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నట్లు అయన తెలిపారు.ఈ పథకం దేశంలో మరెక్కడా లేని గొప్ప పథకం అని కొనియాడారు.వెల్ది గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని అయన హామీ ఇచ్చారు.వెల్ది గ్రామంలో నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండేళ్లలో అంగన్వాడీ భవనం,18 ఇందిరమ్మ ఇండ్లు, 60లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కలుపు కొని మొత్తంగా 1కోటి 50లక్షల రూపాయలు మంజూరు చేసాన ని అయన తెలిపారు.అలాగే రఘునాథపల్లి నుండి వెల్ది మీదుగా అశ్వరావుపల్లి వరకు గల రోడ్డు నిర్మాణానికి 14కోట్ల 25లక్షలతో ప్రతిపాదనలు పంపించానని ఇటీవలే హ్యామ్ కింద మంజూరు వచ్చిందని అతిత్వరలో ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.అలాగె వెల్ది ఎస్సి కాలనీ నుండి రఘునాథపల్లి వెళ్లే రోడ్డు నిర్మాణంతో పాటు వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అయన అధికా రులను ఆదేశించారు.వీలైనంత తొందరగా ఈ రోడ్డును కూడా మంజూరు చేస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద రెండో విడతలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు మంజూరు ఇవ్వడంతో పాటు 20ఇల్లు మంజూరు చేస్తానని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సింగిరెడ్డి సునీత, ఉప సర్పంచ్ ఎడ్ల బాలరాజు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, వార్డ్ నెంబర్లు కొమురవెల్లి దేవస్థానం బోర్డు డైరెక్టర్ గోరిగే రవి,ఇంచార్జి ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,ఏపిఎం ఎల్ల స్వామి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బోనాసి క్రాంతి కుమార్, గాదె మహేందర్ రెడ్డి, మేకల నరేందర్, పాల్గొన్నారు.

## వడదెబ్బకు చెక్..ఎల్గూర్ రంగంపేట గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు..!

- -ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు:సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి



**సంగెం,ఏప్రిల్21(ప్రజాజ్యోతి):** వేసవి కాలాన్ని దృష్టిలో ఎల్గుర్ రంగంపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి మంగళవారం రోజున ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులు,గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం చలివేంద్రాల ఏర్పాటుకు సంకల్పించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దగోని శ్వేతా నరేష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కళ్యాణి పాల్గొని మాట్లాడారు.గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,ఎండలో వెళ్లేవారు మంచినీటిని వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మండల లావణ్య,శాబోతు రంజిత్,వేల్పు గొండ సతీష్,గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## హర్జ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎం.సి.పి.ఐ.(యు) నాయకులు



**చెన్నారావుపేట, ఏప్రిల్ 21:( ప్రజా జ్యోతి)** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన జర్నలిస్ట్ జాటోతు యాకూబ్ నాయక్ తండ్రి హర్జ నాయక్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఎం.సి.పి.ఐ.(యు) మండల కార్యదర్శి జన్ను రమేష్, ఏ7 రిపోర్టర్ జన్ను శ్రీనివాస్లు నేడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి నివాసానికి చేరుకున్న వీరు, హర్జ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ధైర్యాన్ని నింపారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ములుగు ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి ):** చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ములుగు ఎస్సై ఉపేందర్ రావు అన్నారు.ములుగు జిల్లా కాసిందేవి పేట గ్రామంలో మంగళవారం ఎస్సై మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా క్షేమంగా గమ్యం చేరాలని సూచించారు .ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మృతుడి కుటుంబానికి ఈగ మల్లేశం పరామర్శ



**వర్ధన్నపేట ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి.** మృతుడి కుటుంబ సభ్యులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించారు. వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు జాగీర్ల వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి స్వగృహానికి వెళ్లి వీరస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి, పాపారావు, రవీందర్, కరిమిల్ల సంపత్ రావు,శోభన్,శ్రీను, కొమురయ్య, ప్రవీణ్, యాదగిరి, మహేందర్, రమేష్ ,భూషబోయిన సంపత్ యాదవ్,పెద్దూరి రాజ్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన రథశాల ప్రారంభం





**వర్ధన్నపేట ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో నూతన రథశాల మరియు రథం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగరాజు భక్తులతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ ఆవరణ భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. గ్రామ ప్రజల సహకారంతో నూతన రథశాల నిర్మాణం జరగడం అభినందనీయ విషయం. ఈ రథశాల ద్వారా ఆలయ ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించుకోవచ్చు అని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు దరఖాస్తుల ఆహ్వానం

- **జిల్లా యువజన, క్రీడల అధికారి : కె.కోదండ రాములు**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 ( ప్రజాజ్యోతి ) :** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 07 వరకు 14 సంవతరముల లోపు వయసు కలిగిన బాల బాలికలకు ప్రాముఖ్యత కలిగిన కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఇతర క్రీడల నందు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కె.కోదండ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు ఉత్సాహవంతులైన వ్యాయమ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, జాతీయ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరారు. పట్టణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించుటకు వీసీ మరియు ఎండీ, ఎస్ఏటీజీ, హైదరాబాద్ వారు సూచించిన ఫీజు చెల్లించిన క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కావున, జిల్లాలోని ఉత్సాహవంతులైన వ్యాయమ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులు వారు నిర్వహించదలిచిన క్రీడా వివరములు, గ్రామము, ప్రదేశము తెలియజేస్తూ పూర్తి వివరాలతో తమ దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల కార్యాలయములో ఈ నెల 23 లోపు దరఖాస్తులను ఐడిఓసి, రూమ్ నెం. ఎస్ 15 లో అందజేయగలరని, ఇతర వివరాలకు 9182552593 నంబరులో సంప్రదించగలరని విజ్ఞప్తి చేశారు.

# ప్రేమను అంగీకరించలేదని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- **ప్రియుడి మృతి, చికిత్స పొందుతున్న ప్రియురాలు**

**ఏటూరు నాగారం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి** ఓ ప్రేమజంట ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ప్రియుడు మృతి చెందగా. ప్రియు రాలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారంలో చోటు చేసుకుంది.. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండల కృష్ణాపురానికి చెందిన ముక్త్యం సతీష్(20) అదే మండలం కొంగాల గ్రామానికి చెందిన దుబ్బ రవిత్రయని (19) కొన్ని రోజులుగా ప్రేమించుకుంటున్నారు. తమ వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు సమ్మతించరనే భయంతో ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఏటూరునాగారం అటవీ కార్యాలయం సమీపంలోని అడవిలోకి వెళ్లి పురుగులమందు తాగారు. సతీష్ అక్కడికక్కడే మృతి చెందగా, యువతి కేకలు వేస్తూ రోడ్డుపైకి వచ్చి పడిపో యింది. పోలీసులు ఆమెను ఏటూరునాగారంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు యువతికి ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆసు పత్రికి పంపించారు. సతీష్ మృతదేహం సోమవారం మధ్యాహ్నం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థి సమస్యలను పరిష్కరించిన ఎన్ ఎస్ యూ ఐ వరంగల్ జిల్లా నాయకులు

- **విద్యార్థులపై దౌర్జన్యాలు సహించం ఎన్ ఎస్ యూ ఐ జిల్లా నాయకుడు బొల్లం నితిన్ హెచ్చరిక**



**నర్సంపేట ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలోని బాలాజీ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సంబంధం లేని ఫీజుల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు,తల్లిదండ్రులు యాజమాన్యంపై ఆరోపించారు.ఫీజులపై వివరణ కోరిన తల్లిదండ్రులతో యాజమాన్యం నిర్లక్ష్యంగా,దురుసుగా ప్రవర్తించిందని బాధితులు వాపోయారు. మీరు ఏం చేయలేరు అన్నట్టుగా వ్యవహరించడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.ఈ నేపథ్యంలో విద్యార్థులు నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ అఫ్ ఇండియా ఎన్ ఎస్ యు ఐ వరంగల్ జిల్లా నాయకుడు బొల్లం నితిన్‌ను ఆశ్రయించారు.వెంటనే స్పందించిన ఆయన తన బృందంతో కాలేజీకి చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు.విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తూ,ఫీజుల వసూళ్లపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎన్ ఎస్ యూ ఐ జోక్యంతో యాజమాన్యం దిగివచ్చి విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు అంగీకరించింది. అనవసర ఫీజులపై పునర్విచారణ చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ సందర్భంగా విద్యార్థులు,తల్లిదండ్రులు ఎన్ ఎస్ యూ ఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన కోసం ఎర్త్ డే పోస్టర్ ఆవిష్కరణ

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 ( ప్రజాజ్యోతి ) :** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రత్యేక ఎర్త్ డే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం, కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాలలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలంటే సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోస్టర్‌లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ముఖ్య అంశాలు, సందేశాలు, అలాగే సేంద్రీయ ఎరువుల వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం వంటి సూచనలు ప్రతిబింబించాయని, ఈ పోస్టర్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వద్ద ప్రదర్శించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తొనే మక్కజొన్నల కొను గోల్లాలో జాప్యం

- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య**



**పాలకుర్తి ఏప్రిల్ 21 / ప్రజా జ్యోతి /** మక్క జొన్నలు వరి ధాన్యం కొనుగోల్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐలమ్మ మార్కెట్ యార్డులోని సిపిఎం ఆధ్వర్యంలో రైతులు పండించిన మక్కలను కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగిన అనంతరం సిపిఎం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడుతూఈ నెలలో మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం చేసి సుమారుగా 20 రోజులు గడుస్తున్నప్పటికీ 12,000 కింటాలు మాత్రమే కాంటా పెట్టారని వాటిని గోదాంకు తర లించడం లారీలు రాక పోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఏర్పడింద న్నారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తెచ్చి రోజులు గడుస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.రాత్రి వేళల్లో పందుల బెడద, పగలు కోతుల బెడదతో రైతులు పడిగాపులు పడుతున్నారని మండ లంలో సుమారుగా రైతులు 9000 ఎకరాలు సాగు చేసి రెండు లక్షల 69,500 కింటాలు మక్కాలు పంట సాగు చేశారని మండల కేంద్రంలో మొక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం వల్ల కొడకాండ్ల, దేవర్పుల మండలాల నుండి రైతులు మొక్కలు అమ్ముకోవడానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.మార్కెట్లోకి తరలించిన దాన్యం కాంట్రాకర్లు రాక లారీ లేక రోజులు ఎదురు చూసి బయటికి తీసుకెళ్లి ప్రైవేటు వ్యాపారస్తులకు 1800, 1900 లకే అమ్ము కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోయారని తెలిపారు, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర 2400 రూపాయలు అందే విధంగా చూడాలని రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఐకెపి కేంద్రాలను మండలంలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్యే సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని మొక్క జొన్న కేంద్రాలను మండలంలోని అదనంగా ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలని కార్యక్రమాలు ఉధృతం చేయాలని హెచ్చరించా రు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, సీనియర్ నాయకులు సోమ అశోక్ బాబు, వివిధ గ్రామాల నాయకులు పనికర భాస్కర్, చిక్కుడు వెంకన్న, కాకర్ల రమేష్, యాకయ్య, కె చిన్న సోమయ్య, కన్నా, వెంకన్న, సోమ నరసయ్య, మాధవి, ఎల్లమ్మ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల అనంతరం స్వగ్రామానికి చేరుకున్న బడే చుక్కారావు



**ఏటూరు నాగారం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి** మూడు దశాబ్దాల పాటు అజ్ఞాత జీవితం గడిపిన బడే చుక్కారావు (అలియాస్ దామోదర్) ఇటీవల జనజీవన స్రవంతిలో కలిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన తన సొంత గ్రామమైన ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి విచ్చేసి గ్రామస్తులతో ఆత్మీయంగా కలుసుకున్నారు. గ్రామంలోకి అడుగుపెట్టిన చుక్కారావును స్థానికులు హర్షాతిరేకంగా స్వాగతం పలికారు. చాలా ఏళ్ల తరువాత తమ మధ్యకు చేరుకున్న ఆయనను చూసి పెద్దలు, యువత, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో చుక్కారావు స్నేహపూర్వకంగా మాట్లాడి, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకున్న ఆయన, సమాజంలో శాంతి, సౌహార్దం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడిచి, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కష్టకాలంలో కూడా ధైర్యం కోల్పోకుండా జీవితం పట్ల నిబద్ధతతో ఉండాలని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ, చుక్కారావు తిరిగి సాధారణ జీవితంలోకి రావడం ఆనందకర విషయమని, ఇది ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. మార్పు సాధ్యమేనని, ఏ పరిస్థితుల్లోనైనా సత్పథాన్ని ఎంచుకోవచ్చని ఆయన జీవితం ద్వారా స్పష్టమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సంఘటన గ్రామంలో ఒక స్ఫూర్తిదాయక ఘట్టంగా నిలిచి, సమాజంలో మార్పు, పునరావాసం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది.

# పర్వతగిరి నేత కుడికాల శ్రీధర్‌కు బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష పదవి



**పర్వతగిరి, ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి )** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలానికి చెందిన కుడికాల శ్రీధర్‌ను భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. 1995 నుంచి బీజేపీలో పనిచేస్తున్న ఆయన బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా రెండు సార్లు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, అలాగే 2014లో ఎంపీటీసీగా సేవలందించారు. పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకత్వం పేర్కొంది. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

# తీగలు తెగిపడి దహనమైన పంట

- జెసిబి డ్రైవర్ సాహసంతో తప్పిన ముప్పు
- టేకుల బోడులో 11 కేవీ వైర్ల ప్రమాదం.. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం





**నెక్కొండ, ఏప్రిల్ 21: (ప్రజా జ్యోతి)** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం అన్నదాతల పాలిట శాపంగా మారింది. నెక్కొండ మండల పరిధిలోని గుండ్రపల్లి మీదుగా మడిపల్లికి వెళ్లే 11 కేవీ విద్యుత్ తీగలు టేకుల బోడు వద్ద మంగళవారం తెగిపడటంతో పెను ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దొంగల అనిల్‌కు చెందిన ఐదు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతై రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అలాగే బూర శ్రీనుకు చెందిన ఎకరం పంట కూడా దహనమైంది. దొంగల కుమారస్వామి, బండి శివ పొలాల వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు వేగంగా వ్యాపిస్తున్న తరుణంలో, అటుగా వెళ్తున్న జెసిబి డ్రైవర్ తన ప్రాణాలకు తెగించి చాకచక్యంగా వ్యవహరించాడు. జెసిబి సహాయంతో మంటలు పక్క పొలాలకు వ్యాపించకుండా మంటలు ఆర్పేందుకు సహాయం చేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేనిపక్షంలో వందలాది ఎకరాలకు మంటలు వ్యాపించి భారీ నష్టం వాటిల్లేదని స్థానికులు తెలిపారు. అయితే, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని చెప్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లముందే చేతికి వచ్చిన పంట బూడిద కావడంతో కన్నీరుమున్నీరవుతున్న బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్ట చర్యలు

- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- మేయర్ గుండు సుధారాణి



**వరంగల్, ఏప్రిల్ 21(ప్రజాజ్యోతి):** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి ఆలస్యం లేకుండా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, నీటి వృథా నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి ప్రతి ఇంటికి సరిపడా నీటి సరఫరా జరిగేలా చూడాలని, సరఫరా అంతరాయం ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని 66 డివిజన్లలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న, చేపట్టబోయే అభివృద్ధి పనుల పురోగతిని డివిజన్ వారీగా సమీక్షించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ఇంకా టెండర్ కాలేని పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పూర్తయిన పనులను ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హన్మకొండ జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈలు రవి కుమార్, మహేందర్, సంతోష్ బాబు, మాధవి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- 200 కోట్ల రూపాయలతో ములుగు జిల్లాకు గోదావరి జలాలు
- పంచాయతీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క





**మంగపేట ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** ములుగు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 200 కోట్ల రూపాయల నిధులతో ములుగు జిల్లాకు గోదావరి నదీజలాలను మళ్ళించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మంగళవారం మంగపేట మండలం బోర్ నర్సాపూర్ గ్రామం వద్ద గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఆర్&బి రోడ్డు నుండి గోదావరి ఫెర్రీ పాయింట్ వరకు రోడ్ ఇన్ఫ్రా ఐటీడీఏ 11 డిస్ట్రిక్ట్స్ పథకం కింద రెండు కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి మంత్రి దనసరి అనసూయ సీత క్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు సాగు నీటి సౌకర్యాలు కూ డా కల్పిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ములు గు నియోజకవర్గానికి మళ్లించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, 200 కోట్ల రూపాయల నిధులతో గోదావరి జలాల మళ్లింపు పనులకు శ్రీకారం చు ట్టామని పేర్కొన్నారు. మల్లూరు ప్రాజెక్టు నుండి గౌరారం వరకు నీటిని అందించేందుకు అవసరమైన అంచనాలు పూర్తయ్యాయని, ఆ పనులను త్వరలోనే ప్రారంభించి మంగపేట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు, ముఖ్యంగా గోదావరి తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్, ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేసి, గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్.మహేందర్ జీ, జి ల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లిలో డీసీసీబీ నూతన బ్రాంచ్ ప్రారంభం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**రఘునాథపల్లి, ఏప్రిల్ 21 ( ప్రజాజ్యోతి )** రఘునాథపల్లి మండల కేంద్రంలో డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. రైతులు, మహిళలకు ఆర్థికంగా బలంగా నిలబడేందుకు ఇటువంటి బ్యాంకింగ్ సేవలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రఘునాథపల్లిలో బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం కావడం సంతోషకరమని, స్థానికులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వ్యవసాయ భూమిని ఆధారంగా చేసుకుని విద్యారుణాలు అందించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. బంగారు రుణాల రూపంలో ఇప్పటికే రూ.541 కోట్ల వరకు సహాయం అందించడాన్ని ప్రస్తావిస్తూ, సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్యాంకు సేవలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ డీసీసీబీ ఆర్థిక పరిపుష్టి కలిగిన సంస్థగా ప్రజాసేవలో, ముఖ్యంగా రైతు సేవలో ముందంజలో ఉండడం సంతోషకరమని తెలిపారు. నాబార్డ్ సహకారంతో డీసీసీబీ బ్యాంకులు మరింత బలోపేతం అవుతున్నాయని, ప్రతి మండలంలో ఇలాంటి బ్యాంకు ఉంటే ప్రజలకు మరింత సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అవసరమైతే వరంగల్ డీసీసీబీ బ్రాంచ్ ల పెంపు పై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సహకారంతో ఆర్బీఐతో చర్చించి మరిన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో డీసీసీబీ ప్రథమ స్థానంలో నిలుస్తోందని, రైతులు, మహిళా సంఘాలు రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినప్పుడే బ్యాంకులకు మంచి పేరు వస్తుందని సూచించారు. రఘునాథపల్లి ప్రాంత రైతులు డీసీసీబీ సేవలను వినియోగించుకోవాలని, ఇన్‌పుట్ (కర్షన్) లోన్లు, ఎడ్యుకేషన్ లోన్లు వంటి ప్రత్యేక రుణాలు కూడా వరంగల్ డీసీసీబీ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల రుణాలు కూడా విస్తృతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, నాబార్డ్ చంద్రశేఖర్, నాబార్డ్ డి డి ఎం చైతన్య రవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ బొల్లం. ఉమారాణి స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## కీ"శే" జిల్లెల్ల అంకమ్మ స్మారకార్థం ఎస్సీ కాలనీకి బేంచీలు అందజేత

**మహాముత్తారం ,ఏప్రిల్ 21.** ప్రజాజ్యోతిమహాముత్తారం మండల కేంద్రంలోని మాదిగ కాలనీకి మహాముత్తారం గ్రామానికి చెందిన ఎన్నారై జిల్లెల్ల సమ్మిరెడ్డి మరియు రామచంద్రం ఇద్దరు సోదరులు వారి తల్లి కీ"శే"జిల్లెల్ల అంకమ్మ స్మారకార్థం రెండు బెంచీలు డొనేషన్ చేయడం జరిగింది. బేంచీలు డొనేషన్ చేసిన జిల్లెల్ల సమ్మిరెడ్డి, రామచంద్రం సోదరులకు మరియు ఈవిషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి సహకరించిన ఐత తిరుపతి రెడ్డికి స్థానిక కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ మెంబర్ బచ్చల లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం లచ్చయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## రైతు కష్టాలు తీర్చండి.

- మొక్కజొన్న కేంద్రాలను పెంచండి: సంగెం రమేష్



**చెన్నారావుపేట, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి)** రైతులు పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడకుండా, గ్రామ క్లస్టర్ల వారీగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి) జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ డిమాండ్ చేశారు. జల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్ హెచ్ ఆర్ సి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు మండుటెండలు, మరోవైపు ధాన్యం తూకం వేయడంలో ఆలస్యంతో రైతన్నలు కొనుగోలు కేంద్రాల వద్ద తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికల వద్ద క్లస్టర్ల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే పంటను ఆరబోసుకోవడానికి తగినంత స్థలం ఉండేలా చూడాలని ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. నిజమైన రైతు రాజ్యం అంటే రైతులకు సంక్షేమం అందడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మంద నరేష్, ప్రధాన కార్యదర్శి నూనె తిలక్, అల్వాల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

## "పేదల కలలను నిజం చేసింది కాంగ్రెస్ పార్టీ"

- ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం



**ఏటూరు నాగారం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి** ఏటూరునాగారం మండలం రోహిరూ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి మంగళవారం ఘనంగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ఇండ్లలో పాలు పొంగించుకుని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు సొంత ఇల్లు నిర్మాణం ఒక కలగా ఉండేదని, అది నేడు ఇంటి నిర్మాణం పూర్తి చేయడం తో కల సాకారం కావడం ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి గూడు-నీడ కల్పించిన మంత్రి ధనసరి అనసూయ (డాక్టర్ సీతక్క) కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. "పేదల కలలను నిజం చేసింది కాంగ్రెస్ పార్టీ" అంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ సోదరి రామయ్య, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోచయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డోంగిరి మధుబాబు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు గజ్జల అంకుల్, సోదరి దుర్గారావు, జిమిడా రవి, జోడే నర్సయ్య, పగిడి నర్సయ్య, కారోబార్ శంకర్, ఆకుదారి రమేష్, డోంగిరి రాంబాబు, గట్టయ్య, వరలక్ష్మి . ఇంటి యజమాని తల్లాడి పగిడయ్య ..కమల. తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగి, స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన పొందింది.

## జిల్లెల్ల అంకమ్మ స్మారకార్ధం ఎస్సీ కాలనీకి బేంచీలు అందజేత



**మహాముత్తారం ,ఏప్రిల్ 21. ప్రజాజ్యోతి** మహాముత్తారం మండల కేంద్రంలోని మాదిగ కాలనీకి మహాముత్తారం గ్రామానికి చెందిన ఎన్నారై జిల్లెల్ల సమ్మిరెడ్డి మరియు రామచంద్రం ఇద్దరు సోదరులు వారి తల్లి కీ"శే"జిల్లెల్ల అంకమ్మ స్మారకార్ధం రెండు బెంచీలు డొనేషన్ చేయడం జరిగింది. బేంచీలు డొనేషన్ చేసిన జిల్లెల్ల సమ్మిరెడ్డి, రామచంద్రం సోదరులకు మరియు ఈవిషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి సహకరించిన ఐత తిరుపతి రెడ్డికి స్థానిక కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ మెంబర్ బచ్చల లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం లచ్చయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి






- 5శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- మేయర్ గుండు సుధారాణి

**వరంగల్, ఏప్రిల్ 21(ప్రజాజ్యోతి):** ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి కనీసం 30 శాతం సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కృషి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలిసి రెవెన్యూ విభాగ అధికారులు, సిబ్బందితో 5 శాతం పన్ను రాయితీపై వసూళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 5 శాతం రాయితీ సదుపాయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, పన్ను చెల్లింపుదారులు దీనిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం గడువు ముగియడానికి కేవలం 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి బకాయిలు చెల్లించేందుకు ప్రజలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రాయితీ ద్వారా పన్ను చెల్లింపుదారులకు ఆర్థిక లాభం కలుగుతుందని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయానికి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని మేయర్ కోరారు. వసూళ్లలో వెనుకబడిన ఆర్ఐలపై కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టి అంకితభావంతో పనిచేయాలని హెచ్చరించారు. ఇప్పటివరకు కేవలం 8 శాతం మాత్రమే సేకరణ జరిగిందని, 30 శాతం లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని ఆదేశించారు. అవసరాన్ని బట్టి యంత్రాలను కేటాయించి వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గైర్హాజరైన వార్డు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అత్యధిక బకాయిలు ఉన్న 500 మంది పన్ను చెల్లింపుదారులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వసూళ్లలో వెనుకంజలో ఉన్న సిబ్బంది నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. నీటి పన్ను వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఉప కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, సమ్మయ్య, ప్రసన్నారాణి, తహసీల్దార్ రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్, ఆర్ఐలు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేలకోట్ల కమిషన్లు కల్వకుంట్ల కుటుంబానికి ప్రజల నెత్తిమీద అప్పులు

- అమరుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలయింది ఎమ్మెల్యే కడియం



**లింగాల గణపురం, ఏప్రిల్, 21 (ప్రజా జ్యోతి)** మండలంలోని నవాబుపేట గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఒకప్పుడు స్టేషన్ నియోజకవర్గంలో ఎండాకాలం వస్తే త్రాగు నీటికే ఇబ్బంది రోజులు ఉండేవని కానీ ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా దేవాదుల ద్వారా గోదావరి జలాలు తీసుకువచ్చి సాగు సాగు నీటికి, త్రాగు నీటికి కొరత లేకుండా చేసాం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.లింగాల ఘనపూర్ మండలం నవాబ్ పేట గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 15లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎమ్మెల్యే గా ఎన్నికైన నాటి నుండి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి, లింగాల ఘనపూర్ మండలానికి సాగు నీరు అందించాలనే సంకల్పంతో దేవాదుల కాలువలకు మారమ్మత్తులు చేపట్టి జీడికల్ చెరువు నింపి రామచంద్ర స్వామి కాళ్ళు కడిగే అదృష్టం కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఘనపూర్ రిజర్వాయర్ నుండి నేరుగా నవాబ్ పేట రిజర్వాయర్ కు గోదావరి నీళ్లు తీసుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. గతంలో లింగాల ఘనపూర్ మండలం ఎండాకాలం వస్తే త్రాగు నీటి కే ఇబ్బంది పడాల్సి వచ్చేదని, నీటి వసతి లేక చాలా మంది వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు గోదావరి జలాలు రావడంతో సాగు నీటికి, త్రాగు నీటికి కొరత లేకుండా అయిందని దింతో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని పేర్కొన్నారు. సకల జనుల పోరాటం వల్ల ఎందరో ఆత్మ బలిధానాల వల్ల వచ్చిన తెలంగాణ ఒక్క కల్వకుంట్ల కుటుంబం పాలైందని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతి అక్రమాలకు పాల్పడి వేల కోట్ల ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారని అన్నారు. గతంలో ఎమ్మెల్యే గా ఉండి తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చినవాడే ఈ రోజు చాలా మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. కడియం శ్రీహరి తప్పుడు పనులు చేయడని నియోజకవర్గ ప్రజలు తల ఎత్తుకొని గర్వంగా చెప్పుకునే విధంగానే నా పని తీరు ఉంటుందని తెలిపారు. నవాబ్ పేట గ్రామానికి ఈ రెండు సంవత్సరాల కాలంలో మొత్తం 1కోటి 37 లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే రెండో విడతలో మరో 30ఇందిరమ్మ ఇండ్లు, 20లక్షల డ్రైనేజీ, రెండు కమ్యూనిటీ హాల్లు, ప్రధాన రహదారికి మారమ్మత్తుతో పాటు మొత్తం 2కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నెల రోజుల్లో మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు. అందులో మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలతో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఏదో ఒక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్లు, అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు. దానికి మీ అందరి సహకారం, ఆశీర్వాదం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బూడిద సదానందం, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.